క్లుప్తంగా

చంద్రబాబు అరెస్టు సక్రమమే


మోరంపూడి రమేష్

సామర్లకోట: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు సక్రమమేనని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, న్యాయస్థానాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. కేంద్ర నిఘా వర్గాల లేఖతో సీఐడీ అధికారులు దర్యాప్తు కొనసాగించారని తెలిపారు. చంద్రబాబు అరెస్టుతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎందుకు సంబంధం ఉంటుందని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీ ఎందుకు కక్ష సాధింపు చర్యలు చేస్తారన్నారు. చంద్రబాబు అవినీతిని పక్కదారి పట్టించి ప్రజల సానుభూతి పొందడానికి ప్రయత్నిస్తున్నారన్నారు.

మట్టి గణపతి విగ్రహాలే మేలు


సామర్లకోటలో మట్టి గణపతి విగ్రహాలతో చిన్నారుల ప్రదర్శన

సామర్లకోట: వినాయక చవితి సందర్భంగా ప్రతిఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలే ఏర్పాటుచేసుకోవాలని నినాదాలు చేస్తూ చిన్నారులు మట్టి విగ్రహాలతో సామర్లకోటలో శనివారం సాయంత్రం ప్రదర్శన నిర్వహించారు. పీబీ దేవం రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సామర్లకోట బసివిరెడ్డి సత్రం వద్ద మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా అందజేస్తామని సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు.

స్వచ్ఛభారత్ ర్యాలీ


సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, ఎడీఈఎన్ బి.శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ పరిసరాలను శుభ్రం చేసి స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కిషోర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎస్.రామకృష్ణ, చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ఎస్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా స్వామినాయుడు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న స్వామి నాయుడు

కొత్తపల్లి: మండల ఎస్సైగా పీవీసీ స్వామినాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో నాటు సారా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్టు ఆయన తెలిపారు. అంతకు ముందు తుని, కోటనందూరు పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. వీఆర్ నుంచి బదిలీపై రావడం జరిగింది. ఇక్కడ పని చేసిన రామలింగేశ్వరరావు తుని టౌన్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. తీర ప్రాంతంలో డ్రంక్ అండ్ డ్రైవ్, మహిళల భద్రత, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటుపై దృష్టి పెడతానన్నారు. ప్రజలను పోలీసులతో మమేకం చేసేందుకు ఎస్పీ వారధి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థుల ఓజోన్ డే ప్రదర్శన

సామర్లకోట: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తమ వంతు కృషి చేయాలని బచ్చు ఫౌండేషన్ సీనియర్ సైన్సు టీచరు ఏఎల్‌వీ కుమారి అన్నారు. శనివారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్‌చార్జి హెచ్‌ఎం వి.రాజు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓజోన్ పొరను కాపాడుకోవడానికి మొక్కలు నాటడం ఒక్కటే మార్గమన్నారు. విద్యార్థులతో ఓజోన్ డే ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.గోవిందు, కె.అరుణ, కేవీవీ సత్యనారాయణ, సీహెచ్ భద్రమ్మ, కె.శేషారత్నం, డీవీఆర్ఎస్ వల్లీ, బాల శైలజ తదితరులు పాల్గొన్నారు.

గజాననా ఆగమించుమా..

- ముస్తాబవుతున్న చవితి పందిళ్లు
- ఆధ్యాత్మిక అంశాలకు ప్రాధాన్యం
- మండపాల ఏర్పాటులో నిబంధనలు తప్పనిసరి


వాకతిప్పలో గణపతి నవరాత్ర ఉత్సవాలకు మందిరాన్ని సిద్ధం చేస్తున్న స్థానికులు

కొత్తపల్లి: లంబోదరుని ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. వినాయక చవితి సంబరాలకు ఉత్సవ కమిటీలు సంసిద్ధమవుతున్నారు. బొజ్జ గణపయ్య సోమవారం కొలువు దీరనున్నాడు. నియోజకవర్గంలో కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాలతో పాటు పిఠాపురం టౌన్, గొల్లప్రోలు నగర పంచాయతీలో సుమారు వెయ్యి వరకూ విగ్రహాలు ఏర్పాటు చేసేలా ఉత్సవ కమిటీలు సమాయత్తమయ్యాయి. ఆలయాలకు రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. మండపాలను వివిధ రకాల ఆకృతుల్లో ఏర్పాటు చేస్తున్నారు. పిఠాపురం, సామర్లకోట, కాకినాడ, రాజమహేంద్రవరం పట్టణాలకు వెళ్లి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. రూ.1000 నుంచి రూ.20 వేలు విలువైన విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిరోజూ ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, నిమజ్జన సమయంలో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

అనుమతులు తప్పనిసరి



గణపతి నవరాత్రి మహోత్సవాలకు అనుమతులు తప్పని సరి. ఏర్పాటు చేసే మందిరాలకు కమిటీ సభ్యులు ముందస్తు అనుమతులు తీసుకోవాలి. మైక్‌కు అనుమతి ఉండాలి. నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, నిమజ్జనం తదితర విషయాలను కమిటీ సభ్యులు రాతపూర్వకంగా తెలియపరచాలి. ఉత్సవాల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు.

– రామలింగేశ్వరరావు ఎస్సై కొత్తపల్లి

విద్యుత్ సరఫరాకు అనుమతి తీసుకోవాలి

మండపాలకు విద్యుత్ సౌకర్యం కొసం సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. విద్యుత్ తీగల కింద మండపాలను ఏర్పాటు చేసుకోకూడదు.

– ప్రమోద్, విద్యుత్ శాఖ ఏఈ, కొత్తపల్లి

తీరం శుభ్రత అందరి బాధ్యత

ఇన్‌కాయిస్ శాస్త్రవేత్త విజయ్


అమీనాబాదు తీరంలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న అధికారులు, నాయకులు

కొత్తపల్లి: తీరప్రాంత పరిశుభ్రత అందరి బాధ్యత అని ఇన్‌కాయిస్ సంస్థ శాస్త్రవేత్త పి.విజయ్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్ పేరున అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ సంస్థ (ఇన్‌కాయిస్) ద్వారా శనివారం అమీనాబాదు తీరంలోని హార్బర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకార సంక్షేమ సమితి సహకారంతో రాష్ట్రంలో 12 తీరప్రాంతాలు, జిల్లాలోని 37 ప్రాంతాల్లో స్వచ్ఛ సాగర్, సురక్ష సాగర్ ప్రచారాన్ని రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణ, బాపట్ల, ఒంగోలు, నెల్లూరులో శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం సెప్టెంబరు మూడో శనివారం ప్రపంచ వ్యాప్తంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కాయిస్ శాస్త్రవేత సీహెచ్ శ్రావణి, మత్స్యకార నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రైతులను అప్రమత్తం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త మునిరత్నం

పెద్దాపురం: ప్రస్తుత వర్షాల నేపథ్యంలో తలెత్తే వ్యవసాయ ఇబ్బందులపై రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త పి.మునిరత్నం అన్నారు. స్థానిక ఏరువాక కేంద్రంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయాధికారులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ నరసింహరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ శాస్త్రవేత్త పి.మునిరత్నం మాట్లాడుతూ వరి పంటలో ఆశించే తెగుళ్లను ఎదుర్కొనేలా రైతులకు మరిన్ని సూచనలివ్వాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారులు మల్లికార్జునరావు, హరి, జ్యోతిర్మయి, శాస్త్రవేత్తలు నందకిషోర్, శర్మ, సుధీర్, రమణారావు, సుజాత, అనూష తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు


స్వామి వారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

విరాళాలు, టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.3 లక్షల ఆదాయం


భక్తుల పూజలందుకుంటున్న తిరుపతి శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తిల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.3,01,049 ఆదాయం సమకూరినట్లు ఈఓ నారాయణమూర్తి తెలిపారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారన్నారు. స్వామి దర్శనానికి విచ్చేసిన దాతలను ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం ఎస్సైగా మురళీమోహన్



పిఠాపురం: పట్టణ ఎస్సైగా రావూరి మురళీమోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తుని పట్టణ పోలీసు స్టేషన్ నుంచి ఇక్కడకు బదిలీపై రాగా ఇక్కడ పని చేస్తున్న జగన్మోహన్ వీఆర్‌కు వెళ్లారు. పట్టణంలో శాంతి భద్రత పరిరక్షణతో పాటు ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు.

మట్టి విగ్రహాలను పూజిద్దాం

కొత్తపల్లి: వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అన్నారు. స్థానిక వీవీఎస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ హితమే లక్ష్యంగా ఏటా వీవీఎస్ విద్యా సంస్థల ద్వారా మట్టితో తయారు చేసిన విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్టు విద్యాసంస్థల కరస్పాండెంట్ అనిశెట్టి కృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాదగయ హుండీ ఆదాయం రూ.36.06 లక్షలు


పాదగయ క్షేత్రంలో హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రం 198 రోజులకు హుండీ ఆదాయం రూ. 36,06,160 సమకూరినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆలయ అధికారుల పర్యవేక్షణలో హుండీలను తెరిచి లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.36,06,160 ఆదాయం సమకూరినట్లు ఆయన తెలిపారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు పాల్గొన్నారు. 168 రోజుల్లో దర్శనాల ద్వారా రూ.14,69,740, సేవల ద్వారా రూ.23,05,272, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.12,46,175, వసతి సముదాయాల ద్వారా రూ.7,03,044, అన్నదాన విరాళాల ద్వారా రూ.30,63,931 మొత్తం రూ.87,88,162 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

జీజీహెచ్‌లో ఆక్సిజన్ లీక్


మరమ్మతు చేసిన ఆక్సిజన్ పైప్

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో శనివారం సాయంత్రం అలజడి రేగింది. సర్జికల్ భవంతిలోని వార్డులకు వెళ్లే మార్గంలో ఆక్సిజన్ లీకేజీ సంభవించింది. ఆక్సిజన్ పైప్ అనుసంధానం వదిలేసి భారీ శబ్దంతో విడిపోయింది. గోడలకు ఆనుకుని బాహ్యంగా ఉండే ఈ గొట్టాలు తీవ్ర ఒత్తిడితో వాయువు లీకవడంతో భారీ శబ్దం వచ్చింది. దీంతో వార్డుల్లో ఉన్న రోగులు భయపడి పరుగులు పెట్టారు. ఆసుపత్రి సిబ్బంది జరిగిన విషయం చెప్పి వారికి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆక్సిజన్ లీకేజీని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి సహా అధికారులు పరిశీలించారు. తక్షణ మరమ్మతులు చేయించి ఆక్సిజన్ సరఫరాను పునరుద్ధరించారు. జీజీహెచ్‌లో ఆక్సిజన్ నిర్వహణలో నిర్లక్ష్యంపై సీనియర్ వైద్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది.

చిట్టి చేతుల్లో మట్టి వినాయకులు


విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వినాయక ప్రతిమలు

పిఠాపురం: గొల్లప్రోలు ప్రభుత్వ బాలుర హైస్కూలు విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలంటు ప్రజలకు సందేశాన్నిచ్చారు. హెచ్‌ఎం ఎ.రాంబాబు, ఆర్టు టీచర్ ఆచారి ప్రోత్సాహంతో 60 మంది మట్టి, ఇతర కాగితాలు, కూరగాయలు, పళ్లు, వంటి వాటితో 40 రకాల వినాయక విగ్రహాలను తయారు చేసి అబ్బురపరిచారు.

ఏఈలకు డీఈలుగా పదోన్నతి

కాకినాడ: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న నలుగురు ఏఈలకు డీఈలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పుర పరిపాలనశాఖ పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. ఏఈలు కె.లోవరాజు, జేఎస్ఎస్ లక్ష్మి నగరంలోనే డీఈలుగా నియమితులయ్యారు. మరో ఏఈ విరూపాక్ష రాజమండ్రి నగరపాలక సంస్థకు, వై.సుషీకుమారి రాజమహేంద్రవరం రుడాకు పదోన్నతిపై వెళ్లారు. సుదీర్ఘకాలం పాటు ఇక్కడ పనిచేసి డీఈలుగా పదోన్నతి పొందిన ఏఈలను కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి అభినందించారు.

ఆత్మీయ స్వాగతం





నిడదవోలు పట్టణంలోని సెయింట్ ఆంబ్రోస్ పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయిలో వైఎస్సార్ కాపు నేస్తం పథకం నిధుల విడుదలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. తాడేపల్లి నుంచి పట్టణ సమీపంలోని సుబ్బరాజుపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు హెలికాప్టర్‌లో వచ్చిన ఆయనకు పార్లమెంట్ సభ్యురాలు వంగా గీత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు స్వాగతం పలికారు. కాగా కాపునేస్తం పంపిణీ వేదికపై ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు శాలువా కప్పి అభినందించారు.

పంచాయతీ చట్టాలపై అవగాహనకు శిక్షణ దోహదం

- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్
- ముగిసిన రెండు జిల్లాల పంచాయతీ కార్యదర్శుల శిక్షణ


పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేసిన ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు

సామర్లకోట: పంచాయతీ చట్టాలపై కార్యదర్శులు అవగాహన పెంచుకోవడానికి శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గ్రేడ్–1, గ్రేడ్ 5 కార్యదర్శులకు ఆరు రోజుల పాటు నిర్వహించే రెసిడెన్షియల్ ముగింపు శిక్షణలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొత్తగా లేఅవుట్ల ఏర్పాటుపై అమలులో ఉన్న నిబంధనలపై పంచాయతీ కార్యదర్శులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త లేఅవుట్ల ఏర్పాటు, పరిపాలన విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధి హామీ పనులు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, క్షేత్రస్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన తదితర అంశాలపై ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ ముగింపు సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు నేర్చుకున్న అంశాలపై రాతపరీక్ష నిర్వహించారు. అనంతరం కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, శ్రీదేవి, బి.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, ఎస్‌కే మొహిద్దీన్, నిహారిక పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటు పడి చోరీల బాట

- పోలీసుల అదుపులో తొమ్మిది మంది యువకులు
- రూ.10 లక్షలు రికవరీ చేసే దిశగా చర్యలు

పిఠాపురం: వారంతా చదువుకున్న యువకులు. సమాజంలో కొంత గుర్తింపు ఉన్న కుటుంబాలకు చెందినవారు. బయట జులాయిగా తిరిగే యువకులను చూసి వారిలా జల్సాలకు అలవాటు పడ్డారు. జల్సాలకు డబ్బులు కావలసి వచ్చి చోరీల బాట పట్టారు. ఆ డబ్బుతో గోవా వంటి ప్రదేశాలకు వెళ్లి జల్సాలు చేస్తున్నారు. ఈ విషయాలేవీ తల్లిదండ్రులకు తెలియకపోవడం గమనార్హం. రాత్రి సమయాల్లో జరుగుతున్న ఈ చోరీలపై పోలీసులు నిఘా పెట్టారు. చివరకు ఒక బడ్డీ కొట్టులో జరిగిన చోరీలో వీరు దొరికిపోయారు. తీగ లాగితే డొంక కదిలినట్టు వారి చోరీల చిట్టా చాంతాడంత బయటపడింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం గొల్లప్రోలు నగరపంచాయతీ, గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన తొమ్మిది మంది యువకులు స్నేహితులు. తమకు పరిచయం ఉన్న ఇళ్ల వారు ఏదైనా ఊరు వెళ్తే చాలు.. ఆ ఇంటిని కొల్లగొట్టి ఆ సొమ్ముతో గోవా వంటి ప్రాంతాలకు వెళ్లి జల్సా చేసుకునేవారు. ఇలా మూడు నెలల వ్యవధిలో ఏకంగా తొమ్మిది చోరీలకు పాల్పడ్డారు. ఆ తొమ్మిది మందిలో ముగ్గురు ప్రధాన నిందితులు కాగా, మిగిలిన వారు దొంగతనం చేసిన సొమ్ములతో జల్సాలు చేసిన వారిగా పోలీసులు గుర్తించారు. ఆయా చోరీలకు సంబంధించి రూ.10 లక్షల వరకు రికవరీ చేసే పనిలో ఉన్నట్లు తెలిసింది. ఎస్సై వినయ్ ప్రతాప్‌ను వివరణ కోరగా విచారణ జరుపుతున్నామన్నారు.

ప్రజలందరికీ వైద్య సాయం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు


సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: ప్రజలందరికీ వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించడానికి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. శనివారం పిఠాపురం 15వ సచివాలయ పరిధిలో ఆయన సురక్ష సర్వేను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి వార్డులో వైద్య సిబ్బంది, వలంటీర్లు పర్యటించి అందరి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సేవలు అందించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ నరసింగరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జె.నరసింహనాయక్, డీపీఎంఓ డాక్టర్ పావని, ఎంఓ పూజ, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, ముమ్మిడి శ్రీనివాసరావు, రెడ్డెం జనార్దనరావు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

- మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి
- స్వచ్ఛత లీగ్ 2.0 ర్యాలీ


పిఠాపురంలో మానవహారం నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పిఠాపురం: స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం పిఠాపురంలో 'పర్యావరణాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో మున్సిపల్ కమిషనర్ టీఎల్‌పీఎస్ఎస్ కృష్ణవేణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం సిబ్బంది, మెప్మా, వార్డు సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది మహిళా సంఘాల సభ్యులతో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి కోటగుమ్మం సెంటర్ మీదుగా ఉప్పాడ సెంటర్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ పట్టణ వాసులు తమ ఇళ్లల్లో వచ్చే చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా విడదీసి పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో హానికరమైన రంగులు విగ్రహాలను కాకుండా మట్టి వినాయకులనే పూజించాలని ఆమె కోరారు.

వైద్య విద్యార్థులు మరింత బాధ్యతగా ఉండాలి

- డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీ బాబ్జీ
- ఘనంగా రంగరాయ వైద్య కళాశాల వార్షికోత్సవం


డాక్టర్ బాబ్జీని సత్కరిస్తున్న రంగరాయ యాజమాన్యం

కాకినాడ క్రైం: రంగరాయ వైద్య కళాశాల 65వ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కోరుకొండ బాబ్జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చివరి సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థులు మరింత బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కళాశాల కీర్తి ప్రతిష్ఠలతో పాటు సమాజంలో వ్యక్తిగత గుర్తింపు తమ చేతుల్లో ఉంటాయని అన్నారు. అనంతరం కార్యక్రమ అధ్యక్షుడు, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డాక్టర్ బాబ్జీతో కలిసి పతకాలు అందించి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవిని సత్కరించారు. రంగరాయ వైద్య కళాశాల, విద్యార్థుల తరఫున వీసీ డాక్టర్ బాబ్జీ ప్రత్యేక సత్కారాన్ని అందుకున్నారు.